# కన్నీటి పాట

## ముళ్లపూడి వెంకటరమణ

(గత సంచిక తరువాయి)

ఆనందం

గుండెల్లో అగ్ని

పర్వతం పేలింది.

లావా ఎగజిమ్మింది.

శివుడు విషాన్ని మింగి గొంతులో ఆపినట్టు ఆనందం పైకి తన్నే లావాని గొంతులో ఆపేశాడు. అది తన కన్న బిడ్డ మీద పడితే నాశనం అయిపోతాడు. అంతలో లావాని పరిమార్చి కన్నీరుగా మార్చాడు. కోపాన్ని ఏడుపులోకి తెన్గించాడు.

కన్నీళ్ళు తన్నుకొచ్చాయి.

భోరున ఏడవాలి. గుండె కాళీ అయేలా ఏడవాలి. గోదారికి వరద తగిలేట్టేడవాలి.

ఎక్కడ?

ఇక్కడ కాదు.

ఎప్పుడు!

ఇప్పుడు కాదు.

యాభైయారేళ్ళ బడిపంతులు పబ్లీకున ఏడిస్తే — ఎవరూ జాలిపడరు. నవ్వుకుంటారు. నవ్వుతారు, నవ్విపోతారు.

అది ఇంకా అవమానం.

ఎక్కడో చాటుకుపోయి కసిదీరా హాయిగా ఏడి వెయ్యాలి. గుండె బరువెక్కి పోతోంది.-తడుస్తున్న దూది బస్తాలా.— తొరగా బరువు దించేసుకోవాలి. నీళ్ళలో ఉప్పు బస్తాగా మార్చి పారెయ్యాలి.

"నీ ఏడుపు ఎప్పుడేనా ఏడవచ్చు. ముందు నా ఏడుపు మాడు. ఆకలి... ఆకలి"

"ఒరే! ఒరే! నక్షత్రకుడా! ఏజంటు వెధవా... నీకేవన్నా బుద్ధుందిరా?... ఈ యేడుపు వాయిదా వేసే రకం కాదురా సన్నాసీ... కన్నకొడుకు — తండ్రిని పూలున్నరచేసి పూలు ముప్పావులా నవ్వా



దురా... ఇటువంటి దెబ్బ.. ఇటువంటి శిక్ష — పురాణేతిహాసాలలో చరిత్రలో కాశీమజిలీల్లో ఎక్కడా లేదురా. ఈ బాధ భరించలేమురా. నేను వాడి కడుపాకలి కోసమే రోడ్డుమీద రూపాయి కోసం వంగానురా... అయినా వాడు నన్ను చూసి నవ్వి పోయాడురా... అమ్మబాబోయ్... ఓర్నాయనోయ్... ఏం బాధ, ఏం బాధ...''

''బ్రదర్! నీకంత కోపం అయితే వాడిని ఎడా పెడా నాలుగు లెంపకాయలు కొట్టి కోపం తీర్చుకో. ఒక్క రూపాయి డబ్బుల కోసం మళ్ళీ వంగు. మళ్ళీ వంగు.. మళ్ళీ వంగు.. ఇంకెక్కడైనా వంగు — చోరీ చెయ్యి, జేబులు కొట్టు, నాకన్నం పెట్టు, అంతేగాని, నీ దిక్కుమాలిన దుఃఖ సముద్రంలో హాయిగా ఈతకొడుతూ నన్ను మాడ్చి చంపకు. నీకా హక్కు లేదు.''

''దుర్మార్గుడా! నా వల్ల కాదురోయ్.. మొగుడు వచ్చి ఇల్లాలు ఏడుస్తుంటే రంకు మొగుడొచ్చి రవికలో చెయ్యి పెట్టాట్ట! అలా వుందిరోయ్. కన్నీరుతో కడుపు చెక్కలయి పోయేలా వుందిరా... ఆ నీరు బయటికి పోతేగాని బతకలేమురా. హార్టెటాకు వచ్చేస్తుందిరా.''

''నీకు హార్టుంటేగా ఎటాకు రావటానికి. అదే వుంటే వాల్మీకి ఫామిలీ గురించి, ఆకలి గురించీ ముందే ఆలోచించేవాడివి — నాన జిల్లు, నట్టివేరూ, సుబ్బులక్ష్మి బుజాలూ కాదు.''

''బాబ్బాబు. దెప్పకురా... ఒక్క నిమిషం. నేను గోదాట్లో దిగిపోతాను. నాలుగు మునుగులు మునిగి గబగబ ఏడిచేస్తాను... ఆనక నీ గులామును.''

ఆకలేజంటు సమాధానం వినకుండా ఆనందరావు పరుగున గట్టు చివరకి వెళ్ళి చరచర మెట్లమీదినించి ఉరకలు పరుగులుగా దిగేసి గోదావరి రేవులో మొల బంటి లోతు దాటి ఆగాడు. బుదుంగున మునిగాడు.

శీతాకాలపు చలి...

చలికి ఒళ్ళు ఝుళ్ళు మంది.

గుండె జివ్వుమని బిగించుకుపోయింది. లోపల కన్నీళ్ళు-కళ్ళదాకా వచ్చిన కన్నీళ్ళు అయినుగడ్డలయి ఆగిపోయాయి.

కొయ్యబారిపోయాడు.

బుర్ర పర్రయిపోయింది. ఎలా... ఈ అయిసు కరిగించి కన్నీరుగా తెప్పించాలి... కార్చాలి... ఎలా... ఓ కప్పు వేడి కాఫీ తాగితే—? ఓ పెగ్గు బ్రాందీ వేసేస్తే—? కాని ఛేదు. ఎప్పుడో స్టూడెంటు వయసులో వుండగా ఓ ఫ్రెండు పోయించాడో పెగ్గు. ఇంట్లో కంపు తెలిసింది. నాన్నయ్య లెంపలు వాయించేశాడు. నిషా దిగిపోయింది. చెంపల నెప్పి దిగిపోయింది. దరిమిలా పెళ్ళాడి ప్రేమ నిషాలో జారిపోతే లేచేవేళకి ఐదుగురు పిల్లలు మిగిలారు... రేవులోకి కూనారం లాంచి వస్తోంది. అటు చూశాడు. లాంచి చెక్క మీద షావుకారు సుబ్బారాయుడుగారు నించున్నారు పంచి పట్టుకుని.

ఆయనకి తను మొత్తం 370 రూపాయలు బాకీ. చూశాడా నెత్తి మీద కాలేసి తొక్కేస్తాడు — బలి చక్రవర్తిలా. వెధవ ప్రాణం పోతే పోతుందిగాని — ఏడుపు కడితేరా ఏడవకుండా చస్తే? ఆ కోరిక మిగిలి — దెయ్యమైపోవాలి. లాంచి దగ్గరపడింది. ఆగింది. ఆనందరావు ఠంగున నీళ్ళలో మునిగాడు సుబ్బారాయుడు చూసేలోపల. ఊపిరిసలపడం లేదు.

ఏడుపూ ఏడుపూ రామ్మా... రెండు మూడు ఇనిస్టాలుమెంట్లుగానేనా రా. హమ్మో! ఇక వల్లగాదు. నీళ్ళలోంచి తలపైకెత్తి అటేపు తిరిగి వూపిరి పీల్చాడు.

కొంచెం తలపక్కకి తిప్పి వెనక్కి చూశాడు. షావుకారు గమనించలేదు. కొంచెం అటుపక్కగా తడిగుడ్డలతో మెట్లెక్కుతున్న ఇల్లాలి జఘన సౌందర్యం చూస్తున్నాడు.

అబ్బ! ఎంత బావున్నాయి! ఇట్నించి చూస్తుంటే — కాని, గమత్తేమిటంటే — ఆవిడగారికి తెలీదు. తన వెనకవేపున పిరుదులు ఇంత ప్రాణాలు తీసేంత అందంగా వుంటాయని...

> ఎంతో మంది రచయిత- రచయిత్రులకు నిశ్శబ్దమైన, అందమైన వాతావరణం ఉంటేనే వ్రాస్తారు. కానీ దీనికి విరుద్ధంగా 'బేబీ వుండ్' అనే రచయితకు ప్రక్కన రేడియో వుండాలి. బయట గందరగోళం వుండాలి. అలాగే ఇంకో రచయిత 'మైక్ క్రీవ్'. ఈయనకు ఇంట్లో పెద్దగా భార్య కానీ, పిల్లలు కాని కొట్లాడుతూ- కేకలు వేస్తూ వుంటే మంచి మూడ్ వచ్చి గబ గబా నవల వ్రాసేవాడట.
>
> - చాగాపురం నాగేశ్వరరావు

''ఒరే, పకీడా కాస్త ఊంపపెట్టి గట్టుమీదకి చేర్చిపెట్టరా?'' అన్నారెవరో.

అమ్మో! ఆ గొంతు శరభయ్యది... పోయిన శివరాత్రివాడు వాడు గోదాట్లో స్నానం చేస్తూ హర హర మహదేవ, శంభోశంకర అంటుండగా కరెక్టుగా పదును చూసి పాతిక రూపాయలు అప్పడిగాడు తను. దేవుడిని తల్చుకుంటూండగా అడిగినందుకు తిట్టిపోసి గట్టు మీద కెళ్ళగానే ఇచ్చాడు పాతికాను. శ్రీరామ నవమి లోపల ఇచ్చేస్తానని నీళ్ళలో నిలబడి ఒట్టేశాడు. శ్రీరామ నవమి వెళ్ళిపోయింది. మళ్ళీ శివరాత్రి రాబోతూంది... వెనక్కి తిరిగి మునిగే టైము కూడా లేదు. ఉన్నపళంగా జఘన సుందరిని ఇంకొక్క క్షణం చూసేసి — ఉన్నచోటే మునిగి ఊపిరి బిగబట్టాడు. కృత త్రేత ద్వాపర కలియుగాలు పూర్తి అయిపోయాయి. యుగాంత జలప్రళయం వచ్చేసింది. అందర్నీ ముంచేస్తోంది.

''బ్బాబోయ్'' అంటూ లేచాడు. అప్పటికే శరభయ్య రోడ్డెక్కిపోయాడు.

బ్రతుకు జీవుడా.

''ఆకల్రోయ్ ఆకలి!'' అన్నాడు ఆకలేజంటు.

''ఛావు.''

''నేను చావడమా? నేనంటే ఎవరు వాల్మీకి ఫామిలీ... అంటే నీ పెళ్ళాం అయిదుగురుపిల్లలూ చావాలా?''

''ఇగో... ఇగో! వాళ్ళ జోలికి పోకు. వాళ్ళనలా బతకనీ''

''బతకనివ్వాలనే నా తాపత్రయం!''

ఎదర మెట్ల మీంచి ముగ్గురు కుర్ర వెధవలు దిగారు. చేతిలో సిగరెట్లు... వెధవలు ఎ క్లాసు వెధవలు! మామూలుగా తనని చూస్తే సిగరెట్లు వెనక్కి పెట్టి దాచేసి గజగజ వణికేవాళ్ళు కాని. వాళ్ళలో ఇద్దరికి తను రెండు పదులు బాకీ. ఇపుడు తనే గజగజ వణకాలి. గిరుక్కున వెనక్కి తిరిగాడు. లాంచి మీద ఇంకో ఇద్దరు యములాళ్ళు!

గభాలున మునిగాడు. ఈ రేవులో ఇక బతకలేం — మునుగుతూ లేస్తూ, తల ముంచుతూ తీస్తూ నీళ్ళలోనే జరుగుతూ రేవుకి దూరంగా నడిచాడు. ఇక్కడ జనంగాళ్ళు లేరు. గట్టుకేసి రెండడుగులు వేసి ఆగాడు. మోకాలు బంటి నీళ్ళలో నించున్నాడు. జరిగిన పరాభవం గుర్తుచేసుకున్నాడు...

రూపాయి బిళ్ళ అనుకుని రోడ్డు మీద సోడా బిళ్ళ కోసం వంగాడు తను. నలుగురు వెధవలు నవ్వారు. సర్లే కుర్ర వెధవలు అని సరిపెట్టుకునేవాడే. కాని, అందులో ఒక వెధవ తన కన్నకొడుకు. చదువుకున్న వెధవ... తనని చూసి నవ్వాడు... కోప్పడే సందర్భం కాదు. ఏడవాలి. ఏడుపా! రా! గుండె! బద్దలయిపో... కన్నీరూ! కారుతూ రా... జలపాతంలా కారు. జలపాతంగాదుమూత్రపాతం అంత కూడా కన్నీరు కురవ లేదు. ఈ కన్నీరంతా కిందకెళిపోయిందా?... అన్నట్టు ఇదో కొత్త బాధ. పొట్ట వుబ్బి పగిలేలా వుంది. రోడ్డెక్కి ఏ గోడ దగ్గరో కూచుని ఏడవాలి... ఈ గోదాట్లో కన్నీట్లో నీకట్లో వెన్నెట్లో ఎట్లో అట్లు ఇక్కడే నించున్న సరంగా కానిచ్చేస్తే! కానివ్వడానికి తనెవ్వరు? అదే జరిగిపోతోంది. ఎంత హాయి! ఇన్ని కష్టాల్లో కూడా ఎంత సుఖం! ఎంత హాయి ఈ రేయి నిండెనో! ఎన్ని వాళ్ళకీ బతుకు పండెనో... వా వ్వో! వొవ్వో! హా ! అర నున్న వుంది. అరమున్నలు వాడకంలో లేవుట. హా! హా ! హా !... కదిలి గట్టెక్కుతున్నాడు.

గోదావరి నిండా మబ్బరమైన నీళ్ళున్నాయి. తిండెలాగూ లేదు. ''కాసిని మంచినీళ్ళయినా పంపి చావకూడదూ?'' అని గొణుక్కున్నాడు సొంత ఆకలి పురుషుడు.

''ఆ నీళ్ళు ఖరాబు చేశాను. అవి తాగడం ఎలా? నేనేం మురార్జీ దేశాయిని కాదు.'' ''అయినా బాగుందును. ఆయన వయసు 96. హాయిగా ఆరోగ్యంగా ఉన్నాడు.''

''ఒరేయ్! సొంతాకలి! నువ్వా ఆ ఏజంటు గాడితో ఏకమై సాధిస్తున్నావా? నీ కిది ధర్మం గాదు.''

''గోదాట్లో వుండగా మంచినీళ్ళడగడం కూడా తప్పేనా? మావాడేవన్నా గంగాజలం అడిగాడా? అయినువాటరడిగాడా? నారాయణా అంటే బూతు మాటలా వుంది'' అన్నాడు ఏజంటాకలి విరాగా.

"సరగదుపునే మంచినీళ్ళు పట్టించేస్తే ఆకలి ఛస్తుంది" అన్నాడానందరావు.

"ఆకలి చంపడమేగా మన కాంట్రాక్టు... లోకంలో ఏ హత్య అయినా నేరంగాని, ఆకలిని చంపడం ఒక్కటే మహాపుణ్యంగా పరిగణిస్తుంది ధర్మశాస్త్రం — సొంతానిదైనా ఇంకోడిదైనా."

"వద్దులే — వికారం పెడుతుందయ్యా... కాస్సేపాగు ... ప్రశస్తమైన కన్నీళ్ళు పంపిస్తాను..."

"గుండె మంటలారిపే చన్నీళ్ళు కన్నీళ్ళు
ఉండమన్న ఉండవమ్మ శాన్నాళ్ళు"

"పాటలోటి మన బతుక్కి—"

"కుషీ పొంగిపోయి గాదు - ఆ పాట పాడేది"

సరేగాని, ఆ పాటకర్థం తెలుసా? మహాకవి ఏమన్నాడో చూడు. కన్నీళ్ళు ఆర్పేది గుండెమంటల్నిట! ఆకలి మంటని కాదని ఆ పాట వల్ల మనకి అర్థం అవుతుంది. నువ్వేమో కన్నీళ్ళు పంపిస్తానని సముదాయిస్తున్నావు. అవి మాత్రం వుండివచ్చినట్టు, ఉంటే - ఇందాకా రోడ్డు మీద రూపాయి బిళ్ళ దగ్గరే ఒలికేవి. కన్నీళ్ళు పంపిస్తాట్ట... కన్నీళ్ళు. గొప్ప కామందు. భగీరథుడు—"

వాదించే ఓపిక లేక నోరు మూసుకున్నాడు ఆనందరావు. ఇందాకా రోడ్డు మీద కోపం మాత్రం తన్నుకొచ్చింది. కోపంలో ఏడవడం ఎలా? సమయం సందర్భం లేవు. వెధవని అనుకున్నాడు. అది మాత్రం సులువా?

సందుల్లో నడుస్తున్నాడు. చీకట్లో మొహాలు బాగా కనబడవు. తన పేరు కాకుండా ఇంకోడి పేరు చెప్పి — కాస్త రేచీకటున్నవాడి దగ్గిర అప్పడిగేస్తే—? వచ్చొచ్చింది పిచ్చి ప్లానుకి — ఛీ! ఏడిపినట్టుంది. కసిదీరా ఏడవాలని ఏడ్చి బరువు దించుకోవాలని ఏడుస్తుంటే — మధ్యలో నవ్వేకటా? — అపశకునంలా? ఛీ!

రా! ఏడుపూ రా! కారు... కన్నీరూ! కారు. కురు, జలపాతంలా కురు.

నెత్తిమీద దోసెడు నీళ్ళు ఛెళ్ళున పడ్డాయి. "హాయ్" అంటూ అదిరిపడి పైకి చూశాడు.

పైన ఎవరో ఒకావిడ బాల్కనీలోంచి వంగి, తొంగి చూసింది. చేతిలో మరచెంబుంది.

"అయ్యో నా రాతా! బాబ్బాబు తప్పైపోయింది. నీళ్ళు తాగి కాసిని మిగిలినట్టుంటే పారబోశాను. ఎంగిలి కాదు బాబూ. ఎత్తిపోసుకునే తాగాను. కరచి పెట్టి కాదు. తల తడిసిందా?"

"తలేం ఖర్మ - బతుకే తడిసింది" ఆనందరావు చిరాగ్గా, అసహ్యంగా పైకి చూస్తున్నాడు. రావలసిన కన్నీళ్ళ బదులు సెవ్వారు మాటలు ఎగజిమ్ముతున్నాయి, చిమ్ముబుడ్డిలో రవ్వల్లా—

"పర్లేదు. తల తడిసే వుందిలెండి." అంటూ తడి తలని తడిమి చూసుకుంటూ కదిలాడు.

రావే రావే కన్నీరూ
బావని పట్టుకు తన్నేరూ

ఛీ...ఛీ...ఛీ... దారుణం. కన్నీరనే కరుణ రసం — తప్పు దిక్కుమాలిన మిగతా రసాలన్నీ తన్నుకొచ్చాయి. క్రోధం, కామం, మదం, చొంగ, చిరాకు, ముదార్జీ, జుగుప్స, సమస్తం — అభిషేకం కూడా జరిగిపోయింది. కరుణ రసాత్మకమైన కన్నీరు మాత్రం కరుణించలేదు.

"రిచ్చా! ఐగా రిచ్చా రమ్మంట్రాండైగారూ!"

"రిక్షానా? నాకా? ఎక్కడికి? మా యింటికా!" అన్నాడు పరాగ్గా.

"ఐ బాబూ! బలేవోరే! మనింటికైతే రిచ్చా అడుగుతావా? బలే వోరే... మెరకీదికండి. కొత్త సమస్తరాదికి కొత్త సవర్తలండి. సచ్చినోటూ పైన సద్రూపాయలూ... రిచ్చాకి మీదయే" అనుకోకుండా హాస్యరసం కూడా గుమ్మరిల్లింది.

హు...హు...హు...హు... ఆనందరావు పొట్ట చెక్కలయ్యేట్టు విరగబడి నవ్వసాగాడు. గిరగిర తిరిగి పోయాడు. గంతులేశాడు. ముసిలాడికి దసరా పండగ... హ హ హ హ... నవ్వి నవ్వి కంటనీరు తిరిగేంత పనయింది.

రానీ రానీ... ఈ రకంగానైనా కన్నీరొస్తే, దీంటోకి కరుణరసం కాలవని కలిపెయ్యొచ్చు. నవ్వులోంచో బాధలోంచో ఏడుపంటూ అసలు రానీ! దీని సెవ్వారు... మొయ్యి...

కాని - రాదే! దీని సెవ్వారు తెగ... అదిగో వస్తోంది... కదిలింది కదిలింది గంగ..

"అమ్మో!" కోతి గంతులేస్తున్న ఆనందం కంగారులో గాజుపెంకు మీద కాలేశాడు. కసుక్కున దిగింది. ఓ కాలు పైకెత్తి పెంకును పీకాడు.

"ఏడుపూ! రా! రా! ఇదే సందు.. ఇది మంచి సమయము! రా! రా! రా!"

రాలేదు... రాటం లేదు. ఆరాటం తప్ప..

ఒరే కాముడూ! కడుపులో కామేశ్వరావులూ! ఛీ... ఆకలిగాడికి కాముడని పేరేమిటో! రెండూ ఆకళ్ళేనా? కాముళ్ళు పలకలేదు. వాల్మీకి ఏజంటూ, వాడి ఫామిలీ ఏజంటూ ఇద్దరూ కడుపులోని మంటల్లో దూకి చచ్చిపోయారు.

ఇపుడు ఆకల్లేదు. హాయిగా చల్లగా వుంది. తనకి.

కానీ — వాల్మీకి ఫామిలీ? వాళ్ళేం ఏడుస్తున్నారో - తిట్టుకుని శపిస్తున్నారో?

శపించరు. నాకు రూపాయి దొరకాలని దీవిస్తుంటారు. దొరికించమని దేవుడిని ప్రార్థిస్తుంటారు- ఆకలేసి చచ్చిపోయి నీరసం వచ్చి.

అన్నట్టేదింకో రసం. నవరసాల్లో...ఛి...కాదు... రసంగాని రసం నీరసం.. నీరసం పూనేసింది. సొకాలి... దేకాలి... బరువెక్కిన కాళ్ళు రెండూ వూడదీసి బుజాన వేసుకున్నాడు... చేతులు రెండూ మడిచి జేబులో కుక్కేసుకున్నాడు. కుళాయి నీళ్ళతో కడుపులో జలప్రళయం పెట్టేశాడు. ఆకలీ, రోకలీ కూడా అందులో మునిగి చచ్చిపోయాయి - తనూ చనిపోయాడు.

ఇంటి దగ్గర తలుపు నెట్టగానే తెరుచుకుంది - రామరాజ్యం గదా! దొంగల భయం లేదు. తలుపులకి గడియలుండవు... చెట్టు కింద డేరావాళ్ళకి తలుపులే వుండవుట! వాల్మీకి ఫ్యామిలీ అంతా తలోమూలా నిద్రపోతున్నారు.

జేబులు తడిమే పెళ్ళాం వుండదు. పొట్ట జూసే తల్లి వుండదు. బియ్యం తెచ్చారా అని చూసే పెద్ద కూతురుండదు. కాని, వాడు...? అదుగో, పెద్ద కొడుకు.. యువరాజు. అయిదున్నరడుగుల పొడుగున తాటిబొందలా బోర్లగిలా పడుకున్నాడు.

వెధవా! ఎంత పనిచేశావురా! కంచంలో సున్నం పెట్టి అన్నం తినరా అంటే నీ కెలా వుంటుందిరా? సోడా బిళ్ళని చూపించి రూపాయిలా కనిపించమంటావా? నన్ను నంగమంటావా? నన్ను చూసి నవ్వుతావా? గాడిదా! ఇంత పెద్ద అవమానం ఏ బిడ్డా ఏ తండ్రికీ చెయ్యలేదురా... నిన్ను...నిన్ను... నరికేసినా పాపం లేదు... వద్దు. నరికితే చచ్చే లోపల మేలుకొని - నాన్నా! అన్నం తెచ్చావా? అంటాడు.

తను చావాలి. చావు కన్న అర్జంటు - ఏడవాలి.

ఏడుపా! ఏడుపా! రావే!... రావే లాలీ రామస్వామి లాలీ...

ఆనందరావు... ఆవులించింది... నిద్రాదేవత నిన్ను వరించెగదరా నిర్భాగ్య దామోదరా! 'నిర్భాగ్య' అప్పతమ్ము. అసలు తనే అప్పతమ్ము.. పెద్ద తమ్ము.. ఇన్ని బాధల్ని - ఇంతాకల్నీ సర్దేసే నిద్రేసే. హో — య్ రామచంద్ర...

నారాయణ నారాయణ అంటూ 'ఆ నలుగురూ' తనని లేపేశారు. మోసుకుపోతున్నారు.

పోనీలే - పించను డబ్బులు, పి.ఎఫ్.లో అప్పులు పోగా, మిగిలేవి వస్తాయి. 'వాల్మీకి ఫ్యామిలీ' నాలుగైదు నెల్లు, రెండు మూడు పూట్లా తింటుంది. ఆ లోపల ఇంటివాడూ, అప్పులవాళ్ళూ బాధపడో - భయపడో వసూళ్ళకు పీక్కుతినరు. ఇంకో నాలుగైదు నెల్లు మాడినా అనక తనాఫీసులో పెద్దకొడుక్కి ఎటెండరు పని పడేస్తారు. స్వర్గానికి మెట్ల మీద జపున మందరి.. మెట్లెక్కుతోంది. నెనక నించి చక్కాహో చూస్తున్నాడు. నీ కదేం బుద్ధి అని ఎవడూ అనలేదు. ఎవడికీ కనబడదుగా ఇదీ! పెద్దకొడుకు ఏడుస్తూ ముందుకు నంగాడు. మీదకు నంగాడు నిప్పు కుండతో.

గాడిద కొడకా! నిన్న రాత్రి సోడా బిళ్ళ పడేసి నన్ను వెధవని చేసి నవ్వావు. ఇపుడు ఏడుపా? ఏది

ఫ్రెంచి కవి 'శిలర్' తాను వ్రాసుకునే మేజా బల్ల మీద పూలకుండీ పెట్టుకునేవాడు. తాజా పూలు కుళ్ళిపోయి- చెడు వాసన వచ్చిన తర్వాతనే వ్రాయడానికి ఉత్సాహం కలిగేదట. ఇంకొక విషయమేమంటే శిలర్‌కు సగం బాటిల్ సారా పడితేనే (కడుపులో) - మూడ్ వచ్చేదట వ్రాయడం కొరకు. ఆ తర్వాత ఇంకా విచిత్రమేమంటే- శిలర్ తన పాదాలను చల్లని నీరున్న టబ్‌లో పెట్టుకునేవాడట.

- చాగాపురం నాగేశ్వరరావు

నిజంరా? రెండూనా? దేనికదేనా? నాకు నువ్వు గర్భశత్రువివిరా... ఆ నవ్వుతో నా కడుపులో ఆరని చిచ్చుపెట్టావురా.

సుందర్రామారావు కుండలోని నిప్పులు తండ్రి పొట్ట మీద పోశాడు.

"తలకి కొరివి పెట్టాలిరా దరిద్రుడా... పొట్ట మీద కాదు. పొట్టలో మంటలు బోలెడుంటాయి."

కడుపు భగ్గుమంది. దిగ్గున లేచి కూర్చున్నా డానందరావు.

కలన్న మాట... చావలేదు... ఇంట్లోనే వున్నాడు. ఆకలి మండిపోతోంది. అందరూ పడుకున్నారు. ఏదో తెచ్చుకు తినేసుంటారు. లేకపోతే, తనలా లేనరూ? దేకుతూ వెళ్ళి ఓ మూలనున్న మంచినీళ్ళ బిందెలోంచి నీళ్ళు తాగబోయాడు. గ్లాసు లేదు. చెయ్యిపెట్టి పురిషెడు తీసుకు రెండు గుక్కలు తాగాడు. వేడిగా వున్నాయి. వెధవ బిందె. ఇత్తడి బిందె బదులు మట్టి కుండలో నీళ్ళు చల్లగా వుంటాయి. గుండె మంటలారిపే కుండలో నీళ్ళు చన్నీళ్ళు.

అయినా బిందె పెట్టుబడిదారీ బుద్ధి. ఒక్క బిందెకి వంద కుండలు... హు!... ఇక్కడా అర సున్నా వుంది. ఇవాళ బిందెని అత్తారింటికి తోలెయ్యొచ్చు. రాత్రి బంగాళా దుంపలు వేపడం, కుర్ర వెధవకి ఆమ్లెట్టూ...

అన్నట్లు ఏడవాలిసిన సమోటుండిపోయింది కదూ... ఈ వెధవ చేసిన అవమానమేగా... ఇది మంచి సమయం... ఇదే మంచి సమయం... ఎవరూ చూడరు. కన్నీరు జలపాతంలా కురిసినా, నేల తడవకుండా బిందెలో... ఏడిసినట్టుంది. ఇందాకా గోదారి ఖరాబు... ఇపుడు బిందా? ఛి... అయినా మురార్జీ జలం కన్న కన్నీరు బెటరే...దీని వైద్యప్పట్ల గురించి రీసెర్చి చెయ్యలేదేమో! కన్నీళ్ళు పవిత్రమైననే... నా బొంద. మహాకవి చెప్పాడు. అవి కూడా టూ వెరైటీస్... ఏడ్చినా.. నవ్వినా కన్నీళ్ళే వస్తాయి. ఏ కన్నీరెనకాతలేముందో తెలుసునా? నా కన్నీరెనకాతల ఏముంది? నాకే తెలీదు. ఏడుపా?... కాదు.. అదే అయితే ఇందాకే కారేది. ఇది కోపం బాపతు. కసి బాపతు. ఊడిరాటంలే.. ఇవి అగ్గిలా ముక్కులోంచి పొగల్లా బైటకొస్తాయేమో!... ఏమో మరి... వస్తే రానీ — రానీ... కన్నీర్రానీ... మొహం వంచి ముక్కాడు. కన్నీర్రాలేదు.

గాజుల చప్పుడు — ఉలికిపడి పక్కకి చూశాడు. భార్య మూడంకె వేసి పడుకుంది. మళ్ళీ చప్పుడు. తన భార్య కాదు. పక్కవాటాలోది. 'హు వద్దు.'

"ష్"

"పిల్లలేస్తారు."

"పిల్లల్దాకా మెక్కారు. తాగుడుకన్న ఎక్కువ మత్తు తిండి... లేవరు..."

"ఛి... పిల్లల్నిలా అంటానికి సిగ్గులేదూ?"

"లేదు-"

"హు "

గాజుల చప్పుడు.

నాలుగేళ్ళనాటి అనుభవాలు. ఎంతటి మధుర క్షణాలు... పెద్ద పెద్ద గదుల్లో - ఎవరూ లేని తోటల్లో 'ఏడిస్తే' ఏడిసినట్టుంటుంది... కాని — పిల్లలేస్తారనే భయంతో పక్కవాటాలో వింటారనే సిగ్గుతో — ఆహా! సొంత పెళ్ళాంతో కూడా దొంగచాటు మైథునం! పెద్ద బంగళాల్లో వాళ్ళకీ అదృష్టం లేదు. అందుకే పెళ్ళాలు బోరుకొట్టి కలుపుగడ్డి మేస్తారు వాళ్ళు. కోటి రూపాయలు గుమ్మరించినా ఈ ఆనందం, థ్రిల్ రావు. దాంపత్యంలో త్రీడీ ఇఫెక్ట్ — ఆనందానికి ఊపిరి బరువెక్కింది.

ష్ప... ష్ప... ష్... అబ్బ... ఉండండి... రైక చిరిగి పోతుంది. గాజులు చిట్లాయి. షబ్బ... గుచ్చుకుందా... ఫర్లేదు... నిట్టూర్పులో బరువైన నిట్టూర్పులు.

ఛి...దరిద్రం.. కొండంత దుఃఖం దించుకుందికి (విసర్గలున్నాయి జాగర్త) ఏడవబోతే పక్కవాటావాళ్ళేమేదుస్తున్నారో, ఎలా ఏడుస్తున్నారో —

తనకెందుకు? నీచపు చెవులు - చెవుల తప్పు కాదు. నీచ బుద్ధి — చెవులూ కళ్ళూ బుద్ధియొక్క పరికరాలు మాత్రమే... ఇక్కడ లాభం లేదు. ఈ చప్పుళ్ళు వింటూంటే ఏడుపెలా వస్తుందిటా? తన కన్నీటి తపస్సుకి — ఏకాగ్రతకి ఈ నిధువన కూజితాలు భంగం కలిగిస్తున్నాయి. ఇలా జాగుచేస్తే తెల్లారిపోతుంది. పిల్లల గోల - కాఫీ బాధ - పాల మనిషి వెటకారాలూ — అద్దెల నకీరు హడావుడి అమ్మో! ఏడిస్తే ఇపుడేడవాలి... మిస్సయితే రేపంతా బోలెడు పనులు. ఇంకో గుక్కెడు నీళ్ళు తాగి, మెల్లిగా లేచి పెరట్లో తులసి కోట దాటాడు. బావి దగ్గర ముక్కాలి పీట మీద కూచున్నాడు. గొంతు సవరించుకున్నాడు. చేతుల్లో తల పెట్టుకున్నాడు. దొక్కునే భంగిమలో. ఇక్కడ కొంచెం హాయిగా పైకి ఏడ్చినా పరవాలేదు. బావుంటుంది. వెక్కి వెక్కి కాదు. మంద్రస్థాయిలో ఏడవచ్చు. గుండెలవిసేలా- కాళీ అయిపోయేలా - కన్నీరయిపోయి నెత్తురు బొట్లు కూడా రాలేలా ఏడిచెయ్యొచ్చు. ఎంతవమానం, వు..హూ..హూ..హూ...

ఏడుపు రాదేనిటి? ఇందాకా తాగిన మంచినీళ్ళు కడుపులో దిగే బదులు గుండెల్లో ఒలికిపోయాయా? గుండె మంటలార్పేశాయా? కరుణ రస ఘట్టంలో కన్నీటికి కొరవేమిటి?... ఏమో... కన్నీరు కదల్దం లేదు... దీని దుంపతెగా... సరే కన్నీటి కథలు గుర్తుచేసుకుందాం. పురాణాల్లో చరిత్రలో - జీవితంలో మహోజ్వల ఘట్టాలు జ్ఞాపకం చేసుకుందాం... వెలిసిపోయిన పెళ్ళాంతో సంసారంలో ఒక్కోసారి ఊపు తేకపోతే సినిమా తారలనీ - పరదారలనీ ఆవాహనం చేస్తారుట. అంత పూనుకుంటారుట.— 'పంచ'దారకన్న పరదార తీపిరా అన్నాడు మరో మహాకవి... ఇప్పుడు మనక్కావలసింది సెక్సోద్రేకం కాదు. కన్నీటిని కదిపే వేడి. హరిశ్చంద్ర చక్రవర్తి ఆలిని వేలం వేశాడు. ఏడుస్తూనే. ఆహా! ఎంత బాధాకరమైనది. యావదాంధ్ర లోకం కన్నీరు మున్నీరుగా విలపించారు. డి.వి. సుబ్బారావుగార్ని చూసి — ధర్మరాజు అన్యాయానికి బలై, అడవుల పాలయ్యాడు. కళ్ళెదురుగా దుష్టులు పాంచాలి పైటలాగుతుంటే, ఏడుస్తూ వూరుకున్నాడు. ఓ ధర్మరాజా! ఆ బిగబట్టిన కన్నీళ్ళు కాసిని ఆనందరావుకి అప్పివ్వగలనా? ఏడుపు రాలేదు.

ఊహూ... పురాణాలు మరీ పాతవి. ఏడుపు తెప్పించలేవేమో! ఈ కాలపు ఘట్టాలు బోలెడున్నాయి... సాయంత్రం లైబ్రరీలో పాత పత్రికలు బోలెడు చదివాడు — ఆ!

హర్త్స్ డూటీ కెళ్తున్న పోలీసుని కౌగిలించుకుని అతని భార్యాబిడ్డలు విలపించారు. మళ్ళీ చూస్తామో లేదో—

పాపం!

ఏడుపు రాలేదు.

మంత్రిగారి సన్మానసభ సగంలో వుండగా చావు కబురు వచ్చి సభ రసాభాసయిపోయింది.

ఛీ! నవ్వొచ్చిందేనిటి?

టీ.వీ. లలిత సంగీతం పెడదారి పట్టకుండా తన దారిలోనే వున్నందుకు రేడియో సంగీతం ఆనందించినా — అసూయతో విలపించింది నా గొంతుకి నీ మొహం కూడా తోడై—

హు ...హు ...

రైలు మంత్రిగారు ప్రమాణస్వీకారం చేస్తుండగా పెద్ద పేసంజరు రైలు నదిలో పడి 1500 మంది మరణించారని వార్త. మంత్రి దిగ్భ్రమ చెందారు - ఇంతలోనే రాజీనామా! అని.

ఏడుపా!.. జాలి పడేనా రావే.. రావే..

ముళ్ళపూడి రచనల్లో ఎంత వెతికినా హాస్యం కనపట్టంలేదని మధురాంతకం రాజారాంగారు చాలా బాధపడుతున్నారట! ఆ బాధని అర్థం చేసుకున్నా - అనుభూతికి తెచ్చుకున్నా ఆనందరావుకి ఏడుపు రాలేదు.

తన బిడ్డల్లో కొందరు పరకామణిలో దొంగపనులు చేస్తుంటే ఏమీ అనలేక చూస్తున్న వేంకటేశ్వరుడి దీనగాథ...

లాభం లేదు... హు ...

ఇది బెస్ట్... హోం మంత్రి చిన్నకొడుకు రేప్ చేసిన పోలీసు భార్య దీనగాథ... చివరకామె భర్తనే

ప్రసిద్ధ నవలా రచయిత 'అలెగ్జాండర్ డ్యూమా'కు రంగు రంగుల కాగితాలు కావాలి. నవలకు ఆకాశపురంగు కాగితాలు, కవితలకు పసుపు పచ్చని కాగితాలు, మిగతా రచనలకు (వ్యాసాలు మొదలైనవి) గులాబి రంగు కాగితాలను వాడేవారట. ఇదే విధంగా ప్రసిద్ధ రచయిత 'ఏట్ వేల్'కు తెల్ల కాగితాలంటే చాలా కోపం. అతడు నీలి రంగు కాగితాలనే వాడేవాడట. కానీ జి.కె. చెస్టర్టన్ పోస్ట్ కార్డ్ సైజ్ కాగితాలపైనే వ్రాసేవాడట. పెద్ద కాగితాలపై వ్రాయాలంటే అతడికి భయం కలిగేదట.

- చాగాపురం నాగేశ్వరరావు

అరెస్ట్ చేసి, రేప్ నేరం రుజువు చేసి, జైలుశిక్ష వేసి, రద్దు చేసి, ప్రమోషన్ యిచ్చి — ఆవిడకి ఎం.పి. (మహాపతివ్రత) బిరుదునిచ్చి...

దిక్భ్రమ? — కాని, ఏడుపు రాటంలేదు.

చిత్తశుద్ధిగల జర్నలిస్టు చెత్త సినిమాని పొగుడుతూ, మంచి సినిమాని తెగడుతూ ఒకే పేజీలో రాయవలసిన దుస్థితి ఏర్పడి — పెన్నుతో పొడుచుకుని ఆత్మహత్య చేసుకోబోయాడు.

కొక్కొరోక్కో.

ఆ!... అప్పుడే తెల్లారిందా? — తోందా. కాని, నీ వల్ల కాదు. నీ ఏడుపు కోసం నా పాట ఆగదు, నీ ఏడుపు పొగదూ, నా ఆ పాట ఆగదూ దూ.. దూ... దూ.. దూ... దూ..

కొక్కొరోక్కో.

అమ్మా! ఆకలి.

వెధవా! నోర్మూయ్.

పాలమ్మా! పాలు.

నీకేం బుద్ధుందా? ఆడంగులు నీళ్ళోసుకుంటూంటే చూస్తావా? దున్నపోతా?

కౌసల్యా సుప్రజా రామా.. అంబా... ఠంగ్... ఠంగ్... గుడిగంటలు.. ఈలపాట... అత్తయ్యా! చూడండా పిల్లాడు - బూతు పాటలు పాడుతున్నాడు. పొటెక్కడే - ఈలే కదా? పాట వరసే కదా... బలేవారే.. దాంటో వచ్చే మాట వరసలన్నీ వచ్చి బూతులు... అలాగా... ఏరా పుండాఖోర్! ఏవిటా కూతలు? కాఫీ అయిందా?

గోవిందా - గోహో... వింద అంటూ ఎండిపోయిన ఎర్రబడ్డ కళ్ళతో ఇంట్లోకి నడిచాడు ఆనందరావు.

ఇత్తడి బిందెను కుండల బదులు 170 రూపాయలకు గుట్టుగా తెగ్గించి బంగాళా దుంపలూ, ఉల్లిపాయా, కోడిగుడ్లూ కొని, చాటుగా ఇల్లు చేర్చి, సగర్వంగా ఇల్లాలికి నప్పగించాడు. ఉల్లిపాయల మధ్య ఓ పావలా మల్లెపూలుంచాడు. జీవిత బండి కదిలింది. బజారెక్కి ఆఫీసుకు చేరబోయాడు.

మేడ మూడో అంతస్తు బాల్కనీలో పిల్లాడిని ఎగరేసి ఆడిస్తున్న తండ్రి తూలాడు. పిల్లాడు కింద పడ్డాడు. 'అరె' అంటూ తండ్రీ, 'ఏవండీ' అంటూ భార్యా పడ్డారు.

"గవర్నమెంటు కూడా తక్షణం పడిపోవాలి" అన్నారు అపొజిషన్‌లో మాజీ మంత్రులు—

"ఎందుకు దిగాలి. మాకేం బట్టె?" అన్నారు పొజిషన్‌లో వున్న ఈజీ మంత్రులు.

"చూడండి. మీ రాజ్యంలో తిండి, నీరు లేక ఒక కుటుంబం యావత్తూ మేడ మీంచి దూకి ఆత్మహత్య చేసుకుంది."

"యావత్తు దూకలేదు... ప్రైవేటాలో అత్త మామలూ, ఇంకో ఇద్దరు పిల్లలూ వున్నారు."

"వాళ్ళూ దూకేస్తారు.. లేదా మేం దూకిస్తాం.. తోసేస్తాం, ఇవి ఆత్మహత్యలే."

"అదే నిజమైతే ఆ పాపం మీదే. మేం నిన్న గాక - మొన్నే పవరులోకొచ్చాం - ఈ కుటుంబాలు మీ హయాంలో మలమల మాడి చావాలని నిశ్చయించుకున్నాయి. ఇప్పుడు అమలుచేస్తున్నాయి. మా పాలనలో చావాలని ఆలోచించుకున్నా మీ పాలన రాగానే, ఇహ అస్సలు ఆశ లేదని చావు నిర్ణయం అమలుచేశాయి."

"అయినా, ఇకపైన ఎవరూ మేడ దూకి చావరు. బల్రాం జాకర్ గారి దగ్గర గడ్డి మిషన్లు అద్దెకు తెచ్చి గడ్డి మొలిపించి మేడలు చుట్టూరా గడ్డి పరుపు వేయిస్తాం. సూయిసైడ్ కుటుంబాలు ఇంక చచ్చినా చావలేవు. హు "

"మీ రందరూ డౌన్... డౌన్."

జనం పరిగెడుతున్నారు. లారీ ఆటోని నచ్చడి చేసింది. బస్సువాళ్ళకోసం వచ్చి ఎక్కడ బస్సులు అక్కడ అడ్డదిడ్డంగా ఆపేసి ట్రాఫిక్ జాం చేసేశారు. ఆయ్... హాయ్... బడిలేదు - అని గెంతారు పిల్లలు.

> 'ఎమిల్ జోలా' అలసిపోయినప్పుడే మంచి రచనలు చేసేవాడు. అలసట లేకుంటే - అలసట రావడం కొరకు ఎంతో దూరం నడిచేవాడు. వెళ్ళేటపుడు- వచ్చేటపుడు వీధి లైట్లను లెక్క పెట్టుకునేవాడు. ఒకవేళ పొరపాటున లెక్క తప్పు వస్తే మళ్ళీ వెళ్ళి మళ్ళీ లెక్క పెట్టుకునే వాడు. అప్పుడు అతడికి బాగా అలసట కలిగి వ్రాయ డానికి మూడ్ వచ్చేదట.
>
> - చాగాపురం నాగేశ్వరరావు.

మళయాళం పిక్చరు మార్నింగు టిక్కెట్లు బ్లాకులో అమ్ముదామని - గంటకి పది పైసల వడ్డీ కప్పు తెచ్చి బ్లాకుగా కొనేసిన పకీరుకి టిక్కట్లు చెల్లక అప్పిచ్చిన మార్వాడీని కొట్టాడు. ఇద్దరూ బీటు పోలీసుకి రెండూ ఐదూ చొప్పున ఇచ్చారు. ఇద్దరు ముగ్గురొచ్చినా షో వెయ్యాలంటూ ఇద్దరు హాలు అద్దం మీద రాళ్ళేశారు... వెంటనే ఎదురుగా హోటల్‌లో పూటుగా టిఫిన్ తిన్న జనం "అరెరె! గూండాలు! గూండాలు!" అని కేకలేస్తూ అక్కడున్న మైసూరు పాకులతో లడ్డూలతో కొట్టుకున్నారు. చోటు చాలక బైటకెళ్ళిపోయారు. పోతూ పోతూ క్యాషియర్ చొక్కా పట్టుకుని బయటకీడ్చి పారేశారు. గల్లా పెట్టె ఖాళీ చేశారు.

డిస్కౌంటు బట్టల షాపులో ఎవడో గుడ్డల మీద బీడీ వేశాడు. "ఫైర్! ఫైర్!" అంటూ జనం లోపలకొచ్చి లోపల గుడ్డలన్నీ రోడ్డు మీద పారేశారు. నూటికి నూరు డిస్కౌంటు మీద గుడ్డలన్నీ చెల్లిపోయాయి. 'భయపడకు నీకేం భయం లేదు" అంటూ అగ్నిప్రమాదంలో చిక్కుపడ్డట్టున్న సేల్స్ గరల్స్‌ని చాలా మంది కాపాడారు. చిట్లిన గాజులూ, నగలూ అవీ గుచ్చుకున్నాయి. పాపం... అంబ్యులెన్స్‌కి ఫోన్ చేస్తే పోలీసువాను వచ్చి వైద్యం చేసింది. వాళ్ళ పిల్లల్ని దుబాయ్ వాళ్ళు కొనేశారు - హోల్‌సేల్ రేటు మీద.

అంబ్యులెన్సులో హార్టెటాకుతో ఆస్పత్రి కెళ్తున్న ప్రముఖ నాయకుడు ట్రాఫిక్ జాంలో ఇరుక్కుపోయి గుటుక్కుమంటున్నాడు. హెలీకాప్టర్ వచ్చి వారి దేహాన్ని పైకి లాక్కుంది. 'అమర్ రహే' ... 'జిందాబాద్' అంటున్నారు జనం.

కొత్త టీ.వీ. వంద రూపాయలు - రెండొంద లకు మూడు టీ.వీ.లు, జాంగ్రీ పది పైసలు — పాంటు షర్టు పాతిక రూపాయలు... మార్కెట్ కోలాహలం "ధరలు బాగా తగ్గిపోయాయి.. ఇది మా కృషి ఫలితం" అన్నారు మంత్రి పార్లమెంటులో. రూపాయిన్నర లడ్డు పది పైసలు... విరిగిన జాంగ్రీ పది పైసలు.. ఆఫీసులూ షాపులూ బంద్ అన్నారు.. నాయకులు.. షట్టర్లు దిగిపోయాయి.

"గంటన్నరసేపు హర్తాళ్ విజయవంతంగా జరిగింది. కాబట్టి గవర్నమెంటు రాజీనామా చెయ్యాలి" అంది అపొజిషన్.

"ఇది భయపెట్టి చేయించిన బలవంతపు హర్తాళ్. ఇందుకు మేం ఇప్పుడింకో హర్తాళ్ చేయిస్తాం కాసుకోండి" అంది పొజిషన్.

లేస్తున్న షట్టర్లు జారిపోయాయి. 'హర్తాళ్ జయప్రదం - అపొజిషన్ వాళ్ళంతా రాజకీయ సన్యాసం పుచ్చుకుని అడవుల్లోకి పోవాలి" అన్నారు మంత్రులు.

"రేపొద్దున్న మేం 48 గంటల బంద్ జరిపిస్తాం.. అది గెలిస్తే మంత్రులు మాజీలయి మాతో కలిసిపోవాలి" అన్నారు మాజీలు.

"మేం 96 గంటలు బంద్ చేయిస్తాం"

"మేం 192 గంటలు."

"మధ్యలో ఆదివారం వస్తుంది."

సాయంత్రం అయింది. ఆనందరావు గోదారొడ్డుకి చేరాడు నీరసంగా.

బంగాళాదుంప కూరలో నిమ్మకాయ పిండమని చెప్పడం మర్చిపోయాను — అనుకొన్నాడు రేవులోకి దిగుతూ. వెళ్ళేటపుడు కొనుక్కుపోతే సరి... జేబులో వుంచుకుని అది పిండుకోడం మర్చిపోతే?

నవ్వుకున్నాడు.

రేవులో పడవలు, లాంచీలు, పంట్లు వరసగా గోదావరి లోపలిదాకా కట్టేసి వున్నాయి. ఎక్కి చిట్ట చివరి పడవదాకా వెళ్ళాడు. గట్టుకి చాలా దూరంగా వుంది. కాళ్ళు వేలాడేసి కూర్చున్నాడు. నిర్మానుష్యంగా వుంది. గాలి, నీరు, ఆకాశం... నేల లేదు. బావుంది. చాలా బావుంది. అన్నట్టు తాను ఏడవాలనుకున్నాడు గదూ?— అవునవును. రాత్రి కుదరలా. పగలంతా గొడవలు - ఆఫీసు జోకులు - నవ్వులు - టైపిస్టు పిల్లలు - బజ్జీలు పకోడీలు - టీలూ.. సిగరెట్లు... ఉర్తాళ్ళు...హర్తాళ్ళూ... అంతా హడావుడి.. బాగుంది.

అవునూ... హాయిగా కూచుని పాడుకోవాలనుకోకుండా ఏడవాలనుకోడం ఏవిటి?

"ఇంతకీ ఎందుకేడవాలనుకున్నాను చెప్మా?" అనుకున్నాడు ఆనందరావు.